ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 28 జూన్ 2024



సైకిల్ చక్రంతో రూపొందించిన కలుపు తొలగించే యంత్రం, వేరుశనగ పంటలో కలుపు తొలగిస్తున్న రైతు



గుట్టను తవ్వి.. నిబంధనలు తుంగలో తొక్కి పనులు
ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం గాలికి..
స్థల సేకరణ కూడా చేయని దుస్థితి
ట్రస్టు భవనాల్లోనే నేటికీ నిర్వహణ
నాటి వైసీపీ పాలకుల తీరుపై సర్వత్రా విమర్శలు



వైసీపీ జిల్లా కార్యాలయం

ప్యాలెస్‌పై ఉన్న ప్రేమ ప్రజలపై ఏదీ..?

శరవేగంగా వైసీపీ జిల్లా ఆఫీసు నిర్మాణం



శరవేగంగా పనులు..

పుట్టపర్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్య కోసం అంటూ రెండేళ్ల కిందట అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ప్రకటించింది. దీంతో జిల్లా రూపురేఖలు మార్చేస్తామని అప్పటి వైసీపీ పాలకులు ఊదరగొట్టారు. జిల్లా అధికారుల కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. రెండేళ్లలో కనీసం ఆ దిశగా అడుగు కూడా ముందుకు పడలేదు. స్థల సేకరణ కూడా చేయలేదు. దీంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాల్లోనే నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వసతుల్లేని ఆ భవనాల్లో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ కార్యాలయం నిర్మాణం మాత్రం ఆగమేఘాలపై చేపట్టారు. రూ.కోట్లు విలువచేసే రెండెకరాల ప్రభుత్వ భూమిని లీజు పేరుతో కాజేశారు. జిల్లా కేంద్రంలోని విమానాశ్రయం ఎదుట నిబంధనలు తుంగలో తొక్కుతూ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. పెద్ద గుట్ట ఉంటే దానిని తొలగించారు. ఎయిర్‌పోర్టు జోన్‌లో ఉన్నా.. ఖాతరు చేయలేదు. ఎంతో శ్రద్ధతో ఏడాదిలోపే దానిని చకచకా కట్టేశారు. ఆపాటి శ్రద్ధ ప్రజలకు ఉపయోగపడే జిల్లా అధికారుల కార్యాలయాల నిర్మాణంపై ఎందుకు లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిలోనే వైసీపీ ప్యాలెస్ నిర్మాణం పూర్తి చేసుకున్నారే తప్ప.. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం భూమిని కేటాయించలేదు. దీనిని బట్టి నాటి వైసీపీ పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ జిల్లా కార్యాలయం అక్రమమని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణంపై చూపిన శ్రద్ధ.. ప్రభుత్వ ఆఫీసులపై ఎందుకు చూపలేదని ప్రజలు మండిపడుతున్నారు.

ఆగమేఘాలపై పూర్తి

2022లో ఏప్రిల్ 4న పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మినహా జిల్లా అధికారుల కార్యాలయాల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఇరుకు గదుల్లో, చాలీచాలని వసతులతో పాలన సాగించాల్సి వస్తోంది. జిల్లాకేంద్రంలో వసతులు లేకపోవడంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు ఉమ్మడి జిల్లా నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వచ్చామా.. వెళ్లామా.. అన్నరీతిలో వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తితోపాటు ఎనుమలపల్లి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కొత్తచెరువు, బుక్కపట్నం, మామిళ్లకుంట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో అధికారులకే కూర్చునేందుకు కుర్చీలు లేవు. ఒకరు కూర్చుంటే.. మరొకరు నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త జిల్లా ఏర్పాటయ్యాక ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఒక్క భవనాన్ని కూడా నిర్మించలేదు. చాలా కార్యాలయాలు ఉచిత, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. రెండేళ్లు వైసీపీ ప్రభుత్వం కొత్తగా భవనాలకు స్థలం కేటాయించిందిలేదు. జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన ఊసేలేదు. ఇలా ప్రభుత్వ భవనాలపై తీవ్ర అశ్రద్ధ చూపారు. వైసీపీ కార్యాలయ నిర్మాణంపై ఎనలేని శ్రద్ధ చూపారు. ఆగమేఘాలపై పనులు పూర్తి చేసేశారు.



ట్రస్టు భవనాల్లో నిర్వహిస్తున్న జిల్లా కార్యాలయాలు..

పరాయి పంచనే పాలన

పుట్టపర్తి కేంద్రంతోపాటు బుక్కపట్నం, కొత్తచెరువు ప్రాంతాల్లో రెండేళ్ల కిందట జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సమాకూర్చిన భవనాల్లోనే 90 శాతం జిల్లా కార్యాలయాలు కొనసాగుతున్నాయి. సంగీత కళాశాలలో కలెక్టరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ట్రస్టు భవనాల్లో 11 ప్రభుత్వ కార్యాలయాలు, పుట్టపర్తి పడమట ద్వారం దీనజనోద్ధరణ భవన సముదాయంలో 20 ఆఫీసులను ఏర్పాటు చేశారు. ధర్మశాలలో అద్దె ప్రతిపాదికన ఎస్సీ, తదితర కార్యాలయాలున్నాయి. కొత్తచెరువు, బుక్కపట్నం, ఎనుమలపల్లి, కర్నాటకనాగేపల్లి వద్ద కొన్నింటిని ఏర్పాటు చేశారు. కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాయాలు మినహా.. అన్నింటా అరకొర వసతులే. టేబుల్, కుర్చీ వేసుకునేంత స్థలమే ఉంటుంది. ఓ అధికారి కూర్చుంటే.. మరొకరు నిల్చోవాల్సిన దుస్థితి. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో బాత్ రూమ్‌లు సరిగాలేక చిన్నగదుల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది. కప్పలబండ రెవెన్యూ పొలంలో జిల్లా కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణానికి భూమిని గుర్తించినా ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. వైసీపీ కార్యాలయ నిర్మాణం మాత్రం ఆగమేఘాలపై చేపట్టారు. దీంతో అప్పటి సీఎం జగన్ స్వీయప్రయోజనాలకే పెద్దపీట వేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శభాష్.. రైతన్నా..

పంట పెట్టుబడులు పెరిగిపోయాయి. దిగుబడులు మాత్రం రావట్లేదు. వెరసి.. అన్నదాతకు నష్టాలే మిగులుతున్నాయి. కరువు జిల్లా రైతు పరిస్థితి మరీ దుర్భరం. ఈ పరిస్థితుల్లో పంట పెట్టాలంటేనే జంకుతున్నాడు. వేలకువేల రూపాయలు పెట్టుబడులు పెట్టలేక దిక్కులు చూస్తున్నాడు. మడకశిర మండలంలోని కదిరేపల్లికి చెందిన రైతు నాగరాజు పరిస్థితీ ఇదే. నాలుగెకరాల భూమి ఉంది. మొత్తంగా సాగుచేసేందుకు డబ్బుల్లేవు. దీంతో రెండెకరాల్లో మాత్రమే ప్రస్తుత ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేశాడు. విత్తనాల కొనుగోలు, వాటిని విత్తేందుకు చాలా ఖర్చయింది. ఇంతలోనే పంటలో కలుపు పెరిగింది. కూలీ రేట్లు భారీగా పెరిగిన నేపథ్యంలో కలుపు తొలగించుకోవడం అన్నదాతకు భారంగా మారింది. ఎలా అన్న ఆలోచనలో పడ్డాడు. అతడికి వినూత్న ఆలోచన తట్టింది. ఇంట్లో వృథాగా ఉన్న పాత సైకిల్‌ను తీసుకున్నాడు. అందులో సగం తొలగించాడు. ముందుచక్రం, హ్యాండిల్ మాత్రం పెట్టుకున్నాడు. దానికి కలుపు తొలగించేందుకు వీలుగా కొయ్యను అమర్చుకున్నాడు. అలా కలుపు తొలగించే యంత్రాన్ని సిద్ధం చేసుకున్నాడు. దాంతో కూలీల అవసరం లేకుండా తానే పంటలో కలుపును తొలగించుకుంటున్నాడు. ఈ సందర్భంగా రైతు నాగరాజు మాట్లాడుతూ.. తన రెండెకరాల పొలంలో కలుపు తొలగించాలంటే కూలీలకు రూ.6 వేలు కావాలన్నాడు. ఇంట్లో మూలనపడిన సైకిల్ చక్రంతో రూ.1000 ఖర్చుచేసి కలుపు తొలగించే యంత్రాన్ని తయారు చేసుకున్నానన్నాడు. దాని సాయంతో ఐదు రోజుల్లో పొలంలో కలుపు తొలగించనున్నట్లు వివరించాడు. రైతు ఆవిష్కరణను అందరూ అభినందిస్తున్నారు.

-మడకశిర రూరల్

ఇంటి వద్దకే పింఛన్ పంపిణీకి చర్యలు చేపట్టాం

కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జూన్ 27: ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1న లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం వెలగపూడి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పింఛన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆరాతీశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారమే పింఛన్ సొమ్ము బ్యాంకుల నుంచి డ్రా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారంలోపు మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పింఛన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 544 వార్డు, గ్రామ సచివాలయాల్లో 4852 మంది సిబ్బంది ఉన్నారనీ, పంపిణీకి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 27: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల రీవెరిఫికేషన్ కోసం జూలై 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీవెరిఫికేషన్ ద్వారా జవాబు పత్రం నకలు కావాల్సిన వారు రూ.1000 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీవెరిఫికేషన్‌కు ప్రధానోపాధ్యాయుడి ద్వారా స్కూల్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేయాలనీ, సీఎఫ్ఎంఎస్ చలానా డీడీలు, బ్యాంకు చెక్కులను అనుమతించమని డీఈఓ స్పష్టం చేశారు.

అప్పనంగా దోచేశారు..!

ఎన్నికల నిధుల ఖర్చులో మాయలు



- బోగస్ బిల్లులతో స్వాహా
- కర్నూలు ట్రాన్స్‌పోర్టు పేరుతో అద్దె కార్లకు బిల్లులు
- డీజిల్‌లోనూ నొక్కుడే..
- యజమానులకు నేటికీ చెల్లించని దుస్థితి
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు




మడకశిర తహసీల్దార్ కార్యాలయం

మడకశిర రూరల్, జూన్ 27: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిధులను బోగస్ బిల్లులతో అధికారులు దోచేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కర్నూలుకు చెందిన ట్రాన్స్‌పోర్టు పేరుతో వాహనాల అద్దె బిల్లులు డ్రా చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువ మొత్తంలో బిల్లులు డ్రా చేసి, తక్కువ మొత్తంలో చెల్లించినట్లు తెలుస్తోంది. కొందరికైతే నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో వారు అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణ చేస్తున్నారు. బిల్లుల కోసం వాహన యజమానులు ఏకంగా ఆందోళనకే దిగారు. నెల రోజులవుతున్నా.. నేటికీ బిల్లులు మాత్రం చెల్లించలేదు. బూత్ లెవల్ అధికారు (బీఎల్వో)ల శిక్షణ తరగతులు నిర్వహించకున్నా.. నిర్వహించినట్లు బిల్లులు కాజేశారు.

సగం కూడా ఖర్చు చేయలే..?

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం మూడు విడుతలగా నిధులు విడుదలయ్యాయి. మొదటి విడతలో రూ.26,30 లక్షలు, రెండో విడతలో రూ.67,72 లక్షలు, మూడో విడతలో రూ.10 లక్షలు, 2019 ఎన్నికల్లో మిగిలిన నిధులు రూ.3.72 లక్షలు కలిపి మొత్తం రూ.1.07 కోట్ల నిధులు ఇప్పటి వరకు విడుదలయ్యాయి. వీటిలో 45 శాతం మాత్రమే ఎన్నికల నిర్వహణ కోసం ఖర్చు చేసి, మిగిలిన 55 శాతం బోగస్ బిల్లులతో అధికారులు స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిధుల ఖర్చు నిర్వహణ మొత్తం నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ ఆధ్వర్యంలో సాగింది. ఎన్నికల నిర్వహణ నిమిత్తం ప్రస్తుత తహసీల్దార్ ఈ ఏడాది మార్చిలో కర్నూలు నుంచి బదిలీపై వచ్చారు.



కర్నూలుకు చెందిన ఓ ట్రావెల్స్ పేరుతో పెట్టిన బోగస్ బిల్లులు

శిక్షణ పేరుతో రూ.7.16 లక్షలు..

సార్వత్రిక ఎన్నిల కోసం బీఎల్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారు. విచిత్రమేమిటంటే శిక్షణ తరగతులే నిర్వహించలేదట. గతేడాది జూన్ 2, 20, ఆగస్టు 22, అక్టోబరు 26 తేదీల్లో 310 మంది బీఎల్వోలకు శిక్షణ ఏర్పాటు చేసి, భోజనం, స్నాక్స్ కోసం ఒక్కొక్కరికి రూ.340 చొప్పున ఖర్చు చేసినట్లు మొత్తం రూ.5.26 లక్షల బిల్లులు పెట్టారు. నిధులు కూడా డ్రా చేశారు. గతేడాది నవంబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు ఓటరు జాబితాను ఆన్‌లైన్ చేయడానికి ఇద్దరు వ్యక్తులను నియమించుకుని, వారి వేతనాలకు అంటూ రూ.1.90 లక్షలు డ్రా చేశారు. ఆ సమయంలో ఎవ్వరినీ నియమించలేదని తెలుస్తోంది. నియమించుకున్నట్లు రికార్డులూ లేవు.

గతేడాదే స్టేషనరీ కొన్నారట..!

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు గతేడాదే స్టేషనరీ కొనుగోలు చేసినట్లు బోగస్ బిల్లుపెట్టి, రూ1.24 లక్షలు డ్రాచేసి, సొమ్ము చేసుకున్నారు. అందులో గతేడాది జూన్ 11న రూ.31,050, జూలై 14న రూ.31,050, ఆగస్టు 18న రూ.31,050, సెప్టెంబరు 18న రూ.31,488 స్టేషనరీ కొన్నట్లు బిల్లులు పెట్టి రూ.1.24 లక్షలు డ్రా చేశారు. తహసీల్దార్ మడకశిరకు వచ్చిందే ఈ ఏడాది మార్చిలో కాగా.. గతేడాదే స్టేషనరీ కొన్నట్లు బిల్లులు పెట్టడం గమనార్హం. ఎన్నికల వాహనాల మాటున కూడా నిధులు మింగేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టడానికని నిఘా బృందాలను నియమించారు. ఇందులో ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేసింగ్ టీమ్‌లు ఉంటాయి. వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు 11 వాహనాలను అద్దెకు తీసుకున్నారు. వాటి యజమానులకు తెలియకుండా అద్దె వాహనాలు కర్నూలుకు చెందిన ఓ ట్రావెల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బిల్లులు పెట్టి, నిధులు డ్రా చేశారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.2 వేలు అద్దె చెల్లించేలా యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కో వాహన అద్దె రోజుకు రూ.3185 చెల్లించినట్లు బోగస్ బిల్లులు పెట్టి, అదనంగా వచ్చిన మొత్తాన్ని స్వాహా చేశారు. 11 వాహనాలకు మార్చి 17 నుంచి 31వతేదీ వరకు లీటరు డీజిల్ రూ.110తో 2430 లీటర్లు పట్టించినట్లు బిల్లులు పెట్టి, రూ.2.67 లక్షలు డ్రా చేశారు. వాహనదారులు ఒక్కొక్కరికి డీజిల్ కోసం రూ.10 వేలు మాత్రమే ఇచ్చినట్లు తెలిసింది. వీడియో కవరేజీ టీమ్‌కు కూడా తక్కువ మొత్తం చెల్లించి, రోజుకు రూ.4200 బిల్లులు పెట్టి 2024 మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు 15 రోజులకే రూ.2.32 లక్షలు నిధులు డ్రా చేశారు.



		Kurnool			
5	11.06.2023	Revision Activities	Office Stationary Provided to Tahsildar Office, Madakasira Mandal	31,050/-	B.G Rajkumar Stationary, Amarapuram
6	14.07.2023	Revision Activities	Office Stationary Provided to Tahsildar Office, Madakasira Mandal	31,150/-	B.G Rajkumar Stationary, Amarapuram
7	18.08.2023	Revision Activities	Office Stationary Provided to Tahsildar Office, Madakasira Mandal	31,150	B.G Rajkumar Stationary, Amarapuram
8	18.09.2023	Revision Activities	Office Stationary Provided to Tahsildar Office, Madakasira Mandal	31,[illegible]/-	B.G Rajkumar Stationary, Amarapuram

ఎన్నిల నిర్వహణ కోసం 2023లోనే స్టేషనరీ కొనుగోలు చేసినట్లు పెట్టిన బిల్లులు

బిల్లుల కోసం ప్రదక్షిణ

ఎన్నికల నిధులు విడుదలైనా అద్దెకు తీసుకున్న వాహనాలకు అధికారులు నేటికీ పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడం గమనార్హం. దీంతో వాహన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల కోసం వారు గతనెల 31న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. నిధులు రాలేదనీ, వచ్చిన వెంటనే ఇస్తామని అధికారులు చెప్పడంలో అప్పట్లో శాంతించారు. నేటికీ వారికి బిల్లులు చెల్లించలేదు. ఎన్నికల నిర్వహణ కోసం కర్నూలు నుంచి వచ్చిన తహసీల్దార్ బిల్లులు చెల్లించకుండా వెళ్లిపోతారేమోనన్న ఆందోళనతో వాహన యజమానులు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

నిధులను దుర్వినియోగం చేయలేదు

ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటి వరకు వచ్చిన నిధులు సక్రమంగా ఖర్చుచేశాం. దుర్వినియోగం చేయలేదు. ఇంకా నిధులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అద్దె వాహనాలు, ఇతర పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, మడకశిర





వామ్మో.. వానరం..!

రొళ్ల, జూన్ 27: మండలంలోని మల్లినమడుగు వాసులను వానరం భయం పట్టుకుంది. ఒకరిద్దరిని కాదు, పదుల సంఖ్యలో గ్రామస్థులపై వానరం దాడి చేసి, గాయపరుస్తున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానరం దాడిలో గాయపడి బెంగళూరులోని ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇటీవలే గ్రామానికి చెందిన శారదమ్మపై దాడి చేసింది. స్థానికంగా చికిత్స చేయించుకున్నా.. నయం కాకపోవడంతో బెంగళూరులోని ఆస్పత్రిలో చేరారు. దీంతో వానరం ఎక్కడ దాడి చేస్తుందోనని గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. వానరాన్ని అటవీ శాఖాధికారులు పట్టుకుని, అడవిలో వదలాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామస్థులను హడలెత్తిస్తున్న వానరం, గాయపడిన శారదమ్మ

అధికారం శాశ్వతమనుకుంటే పొరపాటే

● మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి



మంత్రి సవితను కలిసిన మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి

పెనుకొండ టౌన్, జూన్ 27: అధికారం శాశ్వత మనకుకుంటే పొర పాటని మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పెనుకొండ టీడీపీ కార్యాలయంలో మంత్రి సవితను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ అధికారం ఉంది కదా అని వైసీపీ నాయకులు దర్బార్‌ను ప్రదర్శించారన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితమయ్యారని పేర్కొన్నారు. ఎవరైనా రూల్స్, రెగ్యులేషన్స్‌ను పాటించాలని సూచించారు. అప్పుడే నాలుగు కాలాలపాటు ఉంటారని, వారిని కూడా ప్రజలు గుర్తిస్తారన్నారు. వై నాట్ 175 అని విర్రవీగితే ప్రజల తీర్పు ఇలానే ఉంటుందన్నారు.

టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా బీకే



పెనుకొండ, జూన్ 27: టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నియామక పత్రాన్ని జారీ చేశారు. తనను టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రికి పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్లకు మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 27: మోటార్లకు మీటర్ల ఏర్పాటును నూతన ప్రభుత్వం నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కోరారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పలు డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని ఏఓ పద్మావతికు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్టుబడి సాయంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట రుణాలకు సంబంధించి రూ.3లక్షల వరకు వడ్డీలేకుండా, రూ.5లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేసి రైతులకు అన్యాయం చేయాలని చూసిందన్నారు. ఆ ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు రమేష్, చలపతి, నగేష్, వెంకటరాముడు, మండల నాయకులు అక్కులప్ప, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీ సేవలు భేష్

డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి

సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేత



డీఐజీ షిమోషికి భోజనం..

అనంతపురం క్రైం, జూన్ 27: సార్వత్రిక ఎన్నికల్లో మీ సేవలు భేష్ అని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి జిల్లా పోలీసులను అభినందించారు. తాడిపత్రి ఘటన మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగించడం సమష్టి కృషి ఫలితమేనన్నారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశంసాపత్రాలు, రివార్డులను ఎస్పీ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. నామినేషన్ల ఘట్టం, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల్లో హోంగార్డుల నుంచి పోలీస్ అధికారుల వరకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రజలతో మమేకమై మర్యాదగా వ్యవహరించడంతోపాటు పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. హోదాలు మరచి పనిచేయడమే కాకుండా పరస్పరం గౌరవించుకుందామని కోరారు. అనంతరం సిబ్బందికి భోజనం వడ్డించి, వారితో కలిసి డీఐజీ, ఎస్పీ భోజనం చేశారు.

చీనీకాయలు టన్ను రూ.27 వేలు

అనంతపురం రూరల్, జూన్ 27: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 580 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అన్నదాత ఆశలపై నీళ్లు

గత టీడీపీ హయాంలో ఉచిత వ్యవసాయ మోటార్ల సరఫరా

పంపిణీని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

మూలనపడ్డ మోటార్లు

కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ఆశలు





ఐఎస్ఐ మార్కు కలిగిన పంపులు

తాడిమర్రి, జూన్ 27: రైతు ప్రభుత్వమని చెప్పుకున్న వైసీపీ పాలకులు.. వారిపైనే తీవ్ర నిర్లక్ష్యం చూపారు. గత టీడీపీ హయాంలో సరఫరా అయిన ఉచిత వ్యవసాయ మోటార్లను రైతులకు అందించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో ఏడేళ్లుగా అవి మూలనపడ్డాయి. అధికారులు సైతం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి.. వాటి పంపిణీని అటకెక్కించారు. దీంతో దాదాపు కోటి రూపాయల విలువచేసే మోటార్లు, పంపులు నిరుపయోగంగా పడి ఉన్నాయి.



స్టార్టర్ పెట్టెలు

పట్టించుకోని గత వైసీపీ పాలకులు

వ్యవసాయానికి విద్యుత్ వాడకాన్ని తగ్గించడంలో భాగంగా రైతులకు అధునాతన మోటార్లను ఉచితంగా అందించాలని 2017 చివర్లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. 240 వ్యవసాయ మోటార్లు, పంపులు, స్టార్టర్ పెట్టెలను సరఫరా చేసింది. వీటి ద్వారా విద్యుత్ వినియోగం తగ్గుతుంది. తక్కువ ఓల్టేజీలో కూడా ఎక్కువ నీరు పారించే అవకాశం ఉంటుంది. ఇంకొన్ని మోటార్లు సరఫరా కావాల్సి ఉండడంతో అన్నీ వచ్చాక పంపిణీ చేద్దామని అప్పట్లో వేచిచూశారు. 2018 ఆఖర్లో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరింది. వ్యవసాయ మోటార్ల పంపిణీని వైసీపీ పాలకులు ఐదేళ్లూ పట్టించుకోలేదు. ఆ తరువాత ఉమ్మడి జిల్లాలోని కొన్ని విద్యుత్‌శాఖ కార్యాలయాలకు నీటిని అందించేందుకు ఇక్కడి మోటార్లు, పంపులను తీసుకెళ్లారని తెలిసింది. ఇలా.. అన్నదాత ఆశలపై వైసీపీ పాలకులు నీళ్లు చల్లారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నిల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. మోటార్లను పంపిణీ చేస్తారని మండల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పేద రైతులకు అందించాలి

తాడిమర్రి ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉన్న మోటార్లను పేద రైతులకు అందించాలి. వాటి వినియోగం ద్వారా రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గనున్నాయి. తక్కువ ఖర్చుతో పంటలు పండించేందుకు వీలవుతుంది.

- ఫక్కీర్‌రెడ్డి, రైతు, శివంపల్లి



నిరీక్షణ ఫలించేనా?

ఉచిత మోటార్ల కోసం ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నాం. కూటమి పాలకులు స్పందించి, వాటిని వెంటనే పంపిణీ చేయాలి.

- నాగేంద్ర, రైతు, మద్దెలచెరువు

మోటార్ల రికార్డులు లేవు

ఉచిత మోటార్లకు సంబంధించిన రికార్డులు మావద్దలేవు. అప్పట్లో కంపెనీ ప్రతినిధులు కార్యాలయంలో దింపారు. అప్పటి ఏఈకి రికార్డులు ఇచ్చి ఉంటారు. ఇప్పుడు ఆ పథకం రద్దయింది. మోటార్లు పంపిణీ చేయాలన్నా.. తిరిగి వెనక్కి పంపాలన్నా.. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

- విజయశంకర్, ట్రాన్స్‌కో ఏఈ

ఉపాధి హామీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఒకటో తేదీన రూ.7 వేలు పింఛన్ పంపిణీ

గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోండి

ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో సమావేశమయ్యారు. ముందుగా ఉపాధి అక్రమాలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, పారిశుధ్యం, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఏ మండలంలో ఏ తరహా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి..? ఆగిపోయిన పనులు ఏవి..? తదితర విషయాలపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఆమె ఆ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జూలై 1న పింఛన్ల పంపిణీ చేస్తున్న నేపథ్యంలో. ఆ ఏర్పాట్లు చేయాలన్నారు. పంపిణీలో భాగంగా మొదటిరోజు మూడు మండలాల్లో, రెండవ రోజు మూడు మండలాల్లో తాను స్వయంగా భాగస్వామినవుతానన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎద్దఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొనాలన్నారు. ప్రస్తుతం సచివాలయాల నిర్వహణ ఎలా ఉందని ఆమె ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ నీరు, వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉంటోందని, వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, పైపులైన్ల లీకేజీలు అరికట్టడం వంటి వాటి మీద దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ బిల్లులు మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. స్థానికంగా లేని వారు పేరుపై జాబ్‌కార్డులు తయారు చేసి ఉపాధి బిల్లులు మంజూరులో భారీ అక్రమాలు జరిగాయన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండ్లతోటల మొక్కలు పెట్టకపోయినా లేని చెట్లను ఉన్నట్లు చూపి బిల్లులు మంజూరు చేస్తున్నారని వాటిని వెంటనే ఆపేయాలన్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఓడిపోయిన, విత్ డ్రా చేసుకున్న వారి డిపాజిట్స్ వెనక్కు ఇవ్వలేదన్నారు. ఆ డబ్బును తిరిగి చెల్లించాలని సూచించారు. అలాగే ప్రాధాన్యత వారీగా తక్షణం చేపట్టాల్సిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖలకు నివేదికలు పంపిద్దామని సూచించారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆయా శాఖల అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు పూలబొకెలతో శుభాకాంక్షలు తెలిపారు.


శాంతి భద్రతలే ప్రధానం

నెలవారి సమీక్షలో ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం క్రైం, జూన్ 27: శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ గౌతమి శాలి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీస్, సెబ్ అధికారులతో పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె నెలవారీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన వివిధ రాకల కేసులు, నేరాల గురించి సబ్ డివిజన్ల వారిగా సమీక్షించారు. దర్యాప్తులో పురోగతి సాధించాలని సూచించారు. రౌడీ షీటర్లు, కిరాయి హంతకుల కదలికలపై నిఘా వేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలు, వీజీపీల భద్రత, సంచలనాత్మక నేరాలు జరిగిన సమయాల్లో ఏం చేయాలో దిశానిర్దేశం చేశారు. మట్కా, పేకాట, మత్తు పదార్థాలు, నాటు సారా కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. జూదం నిర్వహించినా, ప్రోత్సహించినా, వారితో సంబంధాలు కొనసాగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బేసిక్ పోలీసులో భాగంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పెట్టీ కేసులపై దృష్టి పెట్టాలని సూచించారు. మానవ హక్కులకు భంగం కలగకుండా చర్యలు ఉండాలని, కోర్టు ఉత్తర్వులు పక్కాగా పాటించాలని సూచించారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినప్పుడు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అన్నారు. రాత్రి నిఘాలో భాగంగా బీట్స్, పెట్రోలింగ్, రోడ్ సేఫ్టీ బృందాలు, కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు ఆంథోనప్ప, టీవీవీ ప్రతాప్, శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో మెరిసిన అనంత విద్యార్థులు

27 మందికి రాష్ట్రస్థాయిలో 'పది'లోపు ర్యాంకులు



భావన | ప్రసన్నసాయి | ఈశ్వరయ్య | బద్రీనాథ్ | షాహిద | నాగేంద్ర | సలీం | లక్ష్మి

అనంతపురం సెంట్రల్, జూన్ 27: పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మెరిశారు. 31 కోర్సులకు నిర్వహించిన పరీక్షల్లో 27మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పదిలోపు ర్యాంకుల్లో చోటు దక్కించుకున్నారు. సెరికల్చర్ కోర్సులో ఏకంగా నలుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషం. కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇంగ్లీష్, కామర్స్, జియోలజీ, హిస్టరీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, మనస్తత్వ శాస్త్రం, తమిళ్, తెలుగు, జంతుశాస్త్రం కోర్సుల్లో పదిలోపు ఒక్క ర్యాంకు కూడా సాధించలేకపోయారు. కోర్సుల వారీగా ర్యాంకులను పరిశీలిస్తే ఎడ్యుకేషన్‌లో అమరేష్ 3వ ర్యాంకు, ఎఫ్ఎన్ఎస్‌లో భావన 1, హసీన 6వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా బీఎఫ్ఏలో పవన్‌కళ్యాణ్ 2వ ర్యాంకు, బోటనీలో ప్రసన్నసాయి 2, దివ్యశ్రీ 4, శ్రీలత 6వ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జనరల్‌లో ఈశ్వరయ్య మొదటి ర్యాంకు, నాగేంద్ర 6, జియోగ్రఫీలో సలీమ్ 4, బద్రినాథ్ 9, హిందీలో షాహిద 10, లైఫ్ సైన్స్‌లో భావన 4వ ర్యాంకు సాధించారు. సాహిత్యంలో యూన్సీ 2వ ర్యాంకు, గణితశాస్త్రంలో విష్ణువర్ధన్ 12, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్‌లో సునీత 3, ఫిజికల్ సైన్సెస్‌లో బాను 12, పొలిటికల్ సైన్స్‌లో హరిత 5, పాలిమర్ సైన్స్‌లో కల్పన 2వ ర్యాంకు తెచ్చుకున్నారు. సంస్కృతంలో స్వప్నకుమారి 5వ ర్యాంకు, రేవతి 9, సెరికల్చర్‌లో మహాలక్ష్మి 2, ప్రకాష్ 8, వైష్ణవి 9, చందన 10, పర్యాటక మౌనిక 8, ఉర్దూ అస్మా హుమైరా 5 ర్యాంకు సాధించారు. వీరితోపాటుగా బీఈడీ కోర్సుల పరీక్షల్లో మెథడాలజీ ఫిజికల్ సైన్స్‌లో చిలమత్తూరుకు చెందిన లక్ష్మీ తృతీయ ర్యాంకు సాధించింది.

వీసీల రాజీనామా

అనంతపురం సెంట్రల్, జూన్ 27: జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వీరు రాజీనామా లేఖలను పంపారు. జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య కూడా రాజీనామా చేసినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా ప్రకటించలేదు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటి సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అయిన శ్రీనివాసరావును జనవరి 17న అప్పటి ప్రభుత్వం జేఎన్‌టీయూఏ వీసీగా నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడిచింది. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారని సమాచారం. జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్‌గా శశిధర్ మూడు సంవత్సరాలు పనిచేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణను జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

7 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 27: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జూలై 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ సాకేతపురం శోభ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూలై 7న కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనంతో ప్రారంభమై జూలై 19వ తేదీన కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. జూలై 7న కళ్లాయిస్వామి ప్రథమ దర్శనం, 8న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 9న అగ్నిగుండం ఏర్పాటు, 10న స్వామివారిని నిలుపుట, 11న స్వామి వారి నిత్యపూజ నివేదన, 12న స్వామి వారి ఐదవ సరిగెత్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. 13న నిత్యపూజ నివేదన, 14న స్వామివారి ఏడవ సరిగెత్తు, 15న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 16న స్వామివారి గ్రామోత్సవం, రాత్రి స్వామి వారి అగ్నిగుండ ప్రవేశం, 17న 4 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, జలధికి పోయే కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న కుళ్లాయిస్వామి భక్తాదులకు చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ పేర్కొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27: ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఉన్న సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ల కమిటీలకు సంబంధించిన రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. తదుపరి కమిటీల నియామకం, ఎన్నికలు జరిగే వరకు పర్సన్ ఇన్‌చార్జి పాలన కొనసాగనుంది.

సూర్యదేవుడి విగ్రహంపై విచారణ

గుమ్మఘట్ట, జూన్ 27: రైతు పొలంలో లభించిన సూర్యదేవుడి విగ్రహంపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపారు. కలుగోడు గ్రామంలో 2020వ సంవత్సరంలో వేదావతి హగరి సమీపంలో రైతు నాగేంద్ర పొలంలో విగ్రహం బయటపడిన విషయం తెలిసిందే. దీనిని గ్రామస్థులు ఆంజనేయ స్వామి ఆలయంలోని ఒక పెట్టెలో భద్రపరిచారు. అయితే ఈ విగ్రహంపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో తహసీల్దార్ విచారణకు వచ్చారు. లభించిన విగ్రహానికి గుడికట్టుకుని పూజలు నిర్వహించుకుంటామని గ్రామపెద్దలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. 20 రోజులు గడువు ఇస్తున్నామని, గుడి నిర్మించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో విగ్రహాన్ని స్వాధీనపరచుకుంటామని తెలిపారు.

బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 27: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను మేలో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఓలు విష్ణువర్ధన్, లలితకుమారి, విభాగాధిపతులు మమత, అజిత పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



నితిన్

నంబులపూలకుంట, జూన్ 27: మండలంలోని పల్లెనివారిపల్లికి చెందిన విద్యార్థి నితిన్ కనిపించడంలేదని తండ్రి చంద్రమోహన్ గురువారం తెలిపారు. అన్నమయ్య జిల్లా వెలిగల్లులో తమను ఈనెల 12న ద్విచక్ర వాహనంలో నితిన్ వదిలిపెట్టాడన్నారు. అమ్మమ్మ ఊరైన పాపన్నగారిపల్లికి వెళ్లాలని తాము సూచించామని వివరించాడు. పాపన్నగారిపల్లికి వెళ్లి రెండు రోజుల తరవాత మదనపల్లికి నితిన్ వెళ్లాడన్నారు. అప్పటి నుంచి అతడి ఆచూకీ లభించలేదని, బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదన్నారు. మనపల్లిలోని ఓ కాలేజీలో ఎంపీసీలో చేర్పించామని, మార్కులు తక్కువ రావడంతో తిరుపతిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో జాయిన్ చేయించామన్నారు. మదనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తండ్రి చంద్రమోహన్ వివరించాడు. ఆచూకీ లభిస్తే సెల్ నెంబర్ 6309821670కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమణ

తనకల్లు, జూన్ 27: విద్యుదాఘాతంతో రైతు రమణ(40) మృతిచెందిన ఘటన తనకల్లు మండలంలోని బొంతపల్లి పంచాయతీ కొండకిందపల్లి(రత్నగిరి)గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతుడు అన్నమయ్య జిల్లా వడ్డివాండ్లపల్లికి చెందిన రైతు. ఇతడికి అన్నమయ్య జిల్లాతోపాటు శ్రీసత్యసాయి జిల్లాలోని కొండకిందపల్లిలో పొలాలు ఉన్నాయి. అందులో భాగంగా కొండకిందపల్లిలో టమోటా సాగు చేశాడు. గురువారం పంటకు నీరు పడుతుండగా మోటారు ఆగిపోయింది. పరిశీలించగా స్టార్టర్‌లో ఫ్యూజు పోయిందని తెలుసుకుని తనే మరమ్మతు చేసి ఫ్యూజు వేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అట్టహాసంగా హాకీ టోర్నీ ప్రారంభం

• శ్రీసత్యసాయి జిల్లా జట్టు ఘనవిజయం

ధర్మవరం, జూన్ 27: ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో గురువారం 14వ అంతర్‌రాష్ట్ర సీనియర్ బాలుర హాకీ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీ పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి కనబరచాలన్నారు. ధర్మవరంలో క్రీడల అభివృద్ధికి పాటుపడతామన్నారు. మంత్రి సత్యకుమార్, చిలకం మధుతో మాట్లాడి వచ్చే ఏడాది నిర్వహించే టోర్నీకి టర్ఫ్‌కోర్టును తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్


టోర్నీలో తలపడుతున్న శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాల జట్లు

మొదటిరోజు విజేతలుగా పలు జట్లు..

ఉదయం ఎన్టీఆర్ జిల్లా జట్టు 18-0గోల్స్ తేడాతో ఏలూరుపై, ప్రకాశం 8-0తో కడపపై, కాకినాడ 12-0తో కృష్ణాపై, విశాఖపట్నం 2-1తో అన్నమయ్య జిల్లాపై, శ్రీసత్యసాయి జిల్లా 2-0తో కర్నూలుపై గెలుపొందాయి. అనకాపల్లి, అనంతపురం 3-3తో, నెల్లూరు, గుంటూరు మ్యాచ్ 3-3 తేడాతో డ్రాగా ముగిశాయి. కార్యక్రమంలో ఏపీ హాకీ అకాడమీ సీఈఓ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, జనరల్ సెక్రెటరీ హర్షవర్ధన్, కోశాధికారి తామస్ పీటర్, సత్యసాయిజిల్లా ప్రతినిధులు సూర్యప్రకాశ్, ఉడుముల రామచంద్ర, అంజన్న, విశ్వనాథం, ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్ర, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లను ఆధునికీకరించాలి

పుట్టపర్తి, జూన్ 27: జిల్లాలోని బీసీ హాస్టళ్లకు ఆధునికీకరణ పనులు చేపట్టాలంటూ బీజేపీ, జనసేన నాయకులు మంత్రి సవితను కోరారు. నాయకులు హరికృష్ణగౌడ్, కొండమరాజు, జ్యోతిప్రసాద్, బొగ్గరం శ్రీనివాసులు రామాంజనేయులు తదితరులు గురువారం పెనుకొండకు వెళ్లి మంత్రిని కలసి సమస్యలు విన్నవించారు. వసతిగృహాల ఆధునికీకరణతో పాటు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి, సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించారు.


మంత్రికి సత్యసాయి ఫొటోను బహూకరిస్తున్న నాయకులు

షాపింగ్ మాల్‌ను మూసివేయించండి

• చిలకం మధుకు వస్త్రవ్యాపారుల వినతి

ధర్మవరం, జూన్ 27: పట్టణంలో ఇటీవల ఏర్పాటైన ఓ షాపింగ్ మాల్‌ను మూసివేయించాలని స్థానిక వస్త్రవ్యాపారులు కోరారు. ఈ మేరకు జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలో ఆ షాపింగ్‌మాల్ రాకముందు తమ వ్యాపారాలు బాగా జరిగేవని, షాపింగ్ మాల్ వచ్చాక మా వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని, దీంతో ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని వాపోయారు. కావున ఆ షాపింగ్ మాల్‌ను ఇక్కడ లేకుండా చేసి మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇందుకు చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌తో చర్చించి షాపింగ్ మాల్‌ను ఇక్కడి నుంచి పంపించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.


చిలకంకు వినతిపత్రం ఇస్తున్న వస్త్రవ్యాపారులు

గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, జూన్ 27: పట్టణంలోని మూడో వార్డుకు చెందిన చేనేత కార్మికుడు గడ్డంశివ(36) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానిక కూటమి నాయకులు ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మృతుడి కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి బీజేపీ కార్యాలయ సిబ్బంది రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేతన్న ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జూన్ 27: కడుపు నొప్పి తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని యాదవవీధికి చెందిన నరసింహులు కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం నొప్పి తీవ్రం కావడంతో తాళలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


చికిత్స పొందుతున్న నరసింహులు

భార్యపై అనుమానంతో ఆత్మహత్య

గోరంట్ల, జూన్ 27: మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నరసింహమూర్తి (30)భార్యపై అనుమానంతో బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహమూర్తి, సుగుణమ్మ దంపతులకు లాస్య, లిఖిత కుమార్తెలున్నారు. కూలి పనులుచేసుని వారుజీవనం సాగిస్తున్నారు. భార్య సుగుణమ్మ తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో భర్తకు అనుమానం వచ్చి కొంతకాలంగా ఘర్షణ పడేవారన్నారు. ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బుధవారం సాయంత్రం ఇంటిలో ఎవరికీ చెప్పకుండా భార్య ఇళ్లు వదిలి వెళ్లిపోయిందన్నారు. దీంతో నరసింహమూర్తి తీవ్ర మనస్థాపానికి గురై రాత్రి ఇంటిముందున్న రేకుల షెడ్ పైకప్పునకు చీరను గొంతుకు బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే ఇంటికి వచ్చిన భార్య భర్త మరణంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహమూర్తి టీడీపీ కార్యకర్త కావడంతో స్థానిక నాయకులు మనోహర్, బెల్లాచెరువు చంద్ర, మూర్తి, గంగాధర్, అంజనప్ప, ఇర్షాద్, శ్రీరాములు, మల్లికార్జున, సుధాకర్, ఉదయ్, శంకర్ మృతదేహాన్ని సందర్శించి, అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

పెరటి తోటలు పెంచండి

బత్తలపల్లి, జూన్ 27: ప్రతి ఒక్కరు పెరటి తోటలు పెంచాలని వక్తలు సూచించారు. మండలకేంద్రంలోని భారతి మండల సమైక్య కార్యాలయంలో గురువారం గ్రామైక్య సంఘాల సభ్యుల సమావేశం జరిగింది. ఇందులో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇంటి వద్ద ఖాళీ స్థలాలు ఉంటే పెరటి తోటలు పెంచడం అలవాటు చేసుకోవాలన్నారు. దీంతో ఖర్చులేకుండా తాజా కూరగాయలు, ఆకుకూరలు పొందవచ్చని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో రామేశ్వరరెడ్డి, సుదర్శన్ రాజు, లలితా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

నల్లచెరువు, జూన్ 27: మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో గురువారం ఎంఈఓ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష ఎఎంఓ పీ. మహేంద్రరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యాప్రవేశం, రిజిస్టర్, స్పీకాన్ రిజిస్ట్రేషన్, (ప్రభుత్వంతో ముఖాముఖి), బడిబయట పిల్లల చేర్పులు తదితర వాటిపై సమగ్రంగా వివరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాప్రవేశ కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సమగ్ర శిక్ష ఎఎంఓ మహేంద్రరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యాప్రవేశం, రిజిస్టర్, బడిబయట పిల్లలు బడిలో చేర్చే కార్యక్రమం తదితర అంశాలపై సమీక్షించారు. స్టూడెంట్ల కిట్లు గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు లలితమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ధర్మవరం, జూన్ 27: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకుడు మాధవరెడ్డి విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సుమారు 121 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, నోట్‌బుక్కులు తదితరవిద్యాసామగ్రిని అందజేశారు. భీమినేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని, కనుక ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగప్ప, ఉపాధ్యాయులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యాసామగ్రిని అందజేస్తున్న హెచ్‌ఎం, టీడీపీ నాయకులు

రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

• ఆర్డీఓకు ఏపీ రైతుసంఘం వినతి

పుట్టపర్తిరూరల్, జూన్ 27: రాష్ట్రంలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఏపీ రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు కాటమయ్య కోరారు. రైతుసంఘం రాష్ట్రకమిటీ పిలుపుమేరకు గురువారం ఆయన పట్టణంలో ఆర్డీఓ భాగ్యరేఖను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రైతులు వేరుశనగ, కంది, ఇతర పంటల సాగు కోసం సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా సహకరించడం లేదన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి అవసరమైన విత్తనాలను, ఎరువులను సబ్సిడీతో అందించాలని, బ్యాంకులో రుణాలను రెండులక్షల వరకు మాఫీ చేయాలని డిమాండు చేశారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రమణ మాట్లాడుతూ కౌలురైతులకు పెట్టుబడి సాయానికి ఎకరానికి రూ.15వేలు అందించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు 20వేల రూపాయలు బ్యాంకుఖాతాలో జమచేయాలని, 50 ఏళ్ల వయసు నిండిన రైతులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈఅంశాలపై ప్రభుత్వం స్పందించాలని ఏపీ రైతుసంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీసర్వేను రద్దుచేసి అధికారుల ద్వారా మళ్లీ సర్వే నిర్వహించాలన్నారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, గుర్తింపుకార్డు ఉన్న ప్రతిరైతుకు ఒకటిన్నర లక్షల రూపాయలు రుణం మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, జిల్లా అధ్యక్షుడు అడపాల వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ భాగ్యరేఖకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

తనకల్లు: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని సీపీఎం, రైతు సంఘం నాయకులు రైతులతో కలిసి మండలకేంద్రంలోని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రాన్ని అందించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రాయితీలో అందించాలన్నారు. ఒక్కో రైతుకు రూ.రెండులక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం అధ్యక్షుడు చౌడప్పయాదవ్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన

గాండ్లపెంట, జూన్ 27: మండలంలోని కురమామిడి ఆర్బీకేలో గురువారం రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కల్పించినట్లు ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీఏ (డీఆర్‌సీ) సనావుల్లా, ఏడీ అబ్దుల్‌అలీ హాజరై ఖరీఫ్ సీజన్‌లో కంది, వరి, వేరుశనగ, మామిడి, తదితదిర పంటల సాగు, సస్యరక్షణ పద్ధతుల పై సూచనలు, సలహాలు ఇచ్చారని అన్నారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారన్నారు. సర్పంచ్‌లు శివప్పనాయుడు, సుధాకర్, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన

పుట్టపర్తిరూరల్, జూన్ 27: జూలై 1వ తేదీ నుంచి అమలు కానున్న చట్టాలపై పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేర కు అవగాహన సదస్సు జరిగింది. ఐటీ కోర్ టీం సభ్యుడు సుదర్శన్‌రెడ్డి కొత్తచట్టాలైన సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో వచ్చిన అప్డేట్, ఈ సాక్ష్యాయాప్, ఎన్‌సీఆర్బీసంకలన్‌యాప్, డీజీలాకర్ యాప్‌లను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి, వాటిని ఎలా ఇన్వెస్టిగేషన్‌లో ఉపయోగించాలో పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్‌పరిధిలోని డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐటీకోర్‌టీం సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న పోలీసు అధికారులు

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఓబుళదేవరచెరువు, జూన్ 27: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓలు సురేష్‌బాబు, రమణతోపాటు టీడీపీ నాయకులు పరిశీలించారు. తొలుత పాఠశాలలో జూనియర్ కళాశాల ప్రారంభం, ప్రవేశాలపై ప్రధానో పా ధ్యాయురాలు శోభారాణితో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి చెందారు. రోజూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, నాయకులు నిజాం, మండోజీ ఆర్ఫీఖాన్, షబ్బీర్, చాంద్‌బాషా, జ్యోతి, అఖిల, శ్రీనివాసులు, సౌదీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, టీడీపీ నాయకులు

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముదిగుబ్బ, జూన్27: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో మండలకేంద్రంలో దశాబ్దాలుగా నెలకొని ఉన్న తాగు నీటి సమస్యను పరిష్కరించడానికి నడుం బిగించారు. నీటి సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశాల మేరకు ఆయన ఇంజనీరింగ్ సలహాదారు శివప్రసాద్ రెడ్డి గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి మండలకేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో ఉన్న సత్యసాయి ప్రాజెక్టుతో పాటు నీటి సంపును పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్పతో నీటి సరఫరా విషయమై ఆరాతీశారు. పంపు హౌస్‌లో కొన్ని మోటార్లు పనిచేయడం లేదని, పలుచోట్ల మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని తెలుసుకున్నారు. అనంతరం ఇంజనీరింగ్ సలహాదారుడితో పాటు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ ముదిగుబ్బలో తాగునీటి సమస్య తీర్చడాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, ఎన్ని నిధులు ఖర్చు అయినా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంపై దృష్టి పెట్టారని తెలిపారు. త్వరలోనే జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా సత్యకుమార్ ప్రతి ఇంటికీ నీటిని సరఫరా చేసే ప్రణాళిక చేస్తున్నారని అన్నారు. ఆరు నెలల్లోగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీపీ మండల కేంద్రంలోని పారిశుధ్యం నెలకొన్న ప్రాంతాలలో పర్యటించి శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.


సంపును పరిశీలిస్తున్న మంత్రి ఇంజనీరింగ్ సలహాదారు శివప్రసాద్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

మాకొద్దు.. ఈ ప్రధానోపాధ్యాయుడు

• ఎమ్మార్సీలో పరాకువాండ్లపల్లి వాసుల వినతి

తనకల్లు, జూన్ 27: పరాకువాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న రామాంజనేయులు తమకొద్దని మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ఆ గ్రామస్థులు గురువారంవినతిపత్రం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆయన తీరు నచ్చక పాఠశాలకు విద్యార్థులు ఎవరూ వెళ్లడం లేదని అన్నారు. గతేడాది పాఠశాలలో 34 మంది విద్యార్థులుండగా, ఈ సారి ముగ్గురు కూడా లేకుండా పోయారని అన్నారు. ఆయన వస్తే తమ పిల్లలను పాఠశాలకు పంపేది లేదని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయున్ని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంఈఓ లలితమ్మను వివరణ కోరగా.. ఉపాధ్యాయుల మధ్య గొడవల కారణంగా ఇలా జరుగుతోందని అన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

పేద కుటుంబానికి అండగా మంత్రి సత్యకుమార్

ధర్మవరం, జూన్ 27: ఓ పేద ముస్లిం కుటుంబంలోని చిన్నారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ అండగా నిలిచారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన అయూబ్‌ఖాన్ మృతిచెందడంతో ఆయన కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది. సత్యకుమార్ ఎన్నికల సమయంలో ఆ కుటుంబాన్ని సందర్శించి పిల్లల చదువు కోసం తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చుకున్నారు. పిల్లల్లో ఒకరిని జీవనజ్యోతి పాఠశాలలో, మరొకరిని ఆర్డీటీ పాఠశాలలో చేర్పించి వారికి కావలసిన సదుపాయాలను మంత్రి ఏర్పాట్లు చేసినట్టు బీజేపీ నాయకులు గురువారం తెలిపారు. అంతేకాకుండా పేద కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.15వేలు విరాళం

ఓబుళదేవరచెరువు, కదిరి (అమడగూరు), జూన్ 27: అమడగూరు మండలంలోని గాజులపల్లిలోగల మాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తనయుడు సాయి శ్రీనివాస్ గురువారం రూ.15వేలు విరాళం అందజేశారు. వృద్ధుల సౌకర్యార్థం తమ వంతు సాయంగా ఈ నగదు అందించినట్లు ఆయన తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు అరుణజ్యోతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజులనాయుడు, తెలుగుయువత నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కదిరికి చెందిన రిటైర్డ్ టీచర్ జయచంద్ర భూపాల్, అతని కుమారుడు శశిధర్‌భూపాల్, మనవడు బీష్మ ప్రతాప్ అన్నదానం, వస్త్రాదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ నివారణకు వ్యాక్సినేషన్

నల్లమాడ, జూన్ 27: క్షయవ్యాధి నివారణ కోసం ముందుజాగ్రత్తగా సీనియర్ సిటిజన్లకు వ్యాక్సిన్ వేస్తున్నట్టు సీహెచ్ఓ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఈవ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. ఈ క్రమంలో గురువారం చౌటకుంటపల్లి, దొన్నికోట, రెడ్డిపల్లి, కొత్తపల్లితండా, వంకరకుంట తదితర గ్రామాల్లో వేశామన్నారు. 60 ఏళ్ల వయసు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగతాగేవారికి, మ ద్యం సేవించేవారికి భవిష్యత్తులో క్షయ రాకుండా ముందస్తుగా బీసీజీ టీకాలు వేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 485మందికి టీకాలు వేశామన్నారు. అర్హులైనవారు ఈటీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూజర్‌వైజర్ మంజుల, ఏఎన్‌ఎంలు సుభాషిణి, నూహీరాబాను, ప్రేమలత, లావణ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశవర్కర్లు , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధుడికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

భూ రీసర్వేతో రైతులకు ఇబ్బందులు

ముదిగుబ్బ,జూన్27: గత వైసీపీ ప్రభుత్వం చేసిన భూ రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను గురువారం ఆయన రైతులతో కలిసి వెళ్లి మండలకేంద్రంలో తహసీల్దార్ సరస్వతి దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన భూముల రీసర్వేతో ఎందరో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రీసర్వే జరిగిన భూముల్లో సర్వే నెంబర్లు తప్పులు ఉండడం, విస్తీర్ణం తగ్గడం, 1బీలు, అడంగల్‌లు మీసేవ కేంద్రాల్లో రాకపోవడం జరుగుతున్నాయన్నారు. దీంతో రైతులు బ్యాంకు రుణాలు రెన్యూవల్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వాటిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

బాలికల సంక్షేమ వసతి గృహం తనిఖీ

ముదిగుబ్బ, జూన్27: మండల కేంద్రంలోని బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఎంఈఓ రమణప్ప, టీడీపీ మం డల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతి, తాగునీటి సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులపై సమీక్ష

ధర్మవరం, జూన్ 27: పట్టణంలోని కదిరిగేటు వద్ద చేపడుతున్న రైల్వే వంతెన పనులపై అధికారులు గురువారం సమీక్ష నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ ఇంజనీరింగ్ సలహాదారుడు శివప్రసాద్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగపుల్లమరావు, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ తదితరులు కలిసి గతంలో ఉన్న అలైన్మెంట్ కాకుండా ఇతర ప్రదేశాల్లో వంతెనను నిర్మించే విధంగా పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.... వంతెన నిర్మాణంలో ప్రజలు ఎక్కువగా నష్టపోకుండా మరో వైపు తక్కువ ఖర్చుతో అందరికీ అనుకూలమైన ప్రాంతంలో నిర్మాణం చేపట్టాల్సిందిగా మంత్రి ఆదేశించారన్నారు. ఈ విషయంపై తాము పలుప్రాంతాలను పరిశీలించి వంతెన నమూనాలను మంత్రికి తెలియజేసి పురోగతిని వివరిస్తామన్నారు. నాయకులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, సత్యకుమార్ కార్యాలయ సిబ్బంది హరీశ్, మల్లి, మాజీ కౌన్సిలర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో చెత్తాచెదారం తొలగించండి

నంబులపూలకుంట, జూన్ 27: మండలకేంద్రంలోని బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న కాలువలో చెత్తాచెదారం పెద్దఎత్తున పేరుకుపోయింది. వర్షాలు కురిస్తే.. నీరు ఈ కాలువ గుండానే దేవరచెరువుకు చేరుతుంది. అయితే కాలువ పూర్తిగా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు ఇతర చెత్త, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీపంలోని దుకాణాదారులు, నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే ఉంటే ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని వారు వాపోతున్నారు. అంతేకాకుండా వర్షపు నీరు కూడా ముందుకెళ్లే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో చెత్తాచెదారాన్ని తొలగింపజేయాలని కోరుతున్నారు.


కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

బురదమయంగా సచివాలయం దారి

• ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు

గాండ్లపెంట, జూన్ 27: మండలంలోని కటారుపల్లి గ్రామ సచివాలయానికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందేనని సిబ్బంది, ప్రజలు వాపోతున్నారు. సచివాలయానికి నిత్యం సిబ్బంది, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా సచివాలయం ఎదుట ఉన్న మట్టిరోడ్డులో గుంతలు పడడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీళ్లు నిలిచాయి. దీంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. దీంతో సచివాలయానికి వెళ్లాలంటే బురదలో పోవాల్సి వస్తోందని ప్రజలు, సిబ్బంది వాపోతున్నారు. వృద్ధులు బురదలో నడవలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దారిలో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని, గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా ఉన్న సచివాలయానికి వెళ్లే దారి

అసాధారణ స్థాయికి ఎదిగిన వ్యక్తి రామోజీరావు


రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత, నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 27: సాధారణ వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి అసాధారణ స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని మంత్రి సవిత అన్నారు. గురువారం స్థానిక పార్టీకార్యాలయంలో రామోజీరవు ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రఘువీరా చౌదరి, రామలింగ, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, సర్పంచ్ శ్రీనివాసులు, నీరుగంటి చంద్ర, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదల పాలిట వరం... అన్న క్యాంటీన్: మంత్రి


అన్నం వడ్డిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 27: నిరుపేదల పాలిట అన్న క్యాంటీన్ ఓ వరమని, రూ.5కే కడుపునిండా అన్నం పెట్టే ఆలోచన చంద్రబాబు నాయుడుకు రావడం, దానిని రాష్ట్ర వ్యాప్తంగా ఆచరించడం అది టీడీపీకే సాధ్యమని మంత్రి సవిత అన్నారు. గురువారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో మంత్రి ప్రజలకు అన్నం వడ్డించి అలాగే రుచి చూశారు. ఆమె మాట్లాడుతూ అరాచక వైసీపీ ఉన్నప్పటి నుంచి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆపకుండా అన్న క్యాంటీన్ నిర్వహిస్తూ వస్తున్నానని నేటికి 380రోజులు పూర్తి చేసుకున్నట్లు ఆమె తెలిపారు. గుట్టూరు సూరీ, నీరుగంటి చంద్ర, మైనార్టీ నాయకులు దాదు, షౌకత్, ప్రసాద్, మావటూరు గోపాల్, రెడ్డివారి మంజునాథ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ, జూన్ 27: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అంగనవాడీ యూనియన్ నాయకులు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం నాయకులు మంత్రి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందజేస్తూ అంగనవాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించి పరిష్కరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, మాబున్నీషా, లక్ష్మీదేవి, సావిత్రమ్మ, శాంతిబాయ్, పార్వతమ్మ, సుజాత, సుధామణి, మీనాకుమారి, పద్మ, సరస్వతి, అనూష, అలివేలమ్మ, శ్యామలగౌరీ, అనిత పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

పెనుకొండ రూరల్: బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖమంత్రి సవితను గురువారం పార్టీ కార్యాలయంలో ఉద్యోగ సంఘం నాయకులు కలిశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తాలూకా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సంఘం అసోసియేషన్ కార్యదర్శి బషీర్, ప్రెసిడెంట్ నరసింహామూర్తి, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జగన్నాథ్, షెక్షావలి, సాదిక్ పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో ఆత్మహత్య


నరసింహామూర్తి (ఫైల్)

గోరంట్ల, జూన్ 27: మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నరసింహామూర్తి (30)భార్యపై అనుమానంతో బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహామూర్తి, సుగుణమ్మ దంపతులకు లాస్య, లిఖిత కుమార్తెలున్నారు. కూలి పనులు చేసుని వారుజీవనం సాగిస్తున్నారు. భార్య సుగుణమ్మ తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో భర్తకు అనుమానం వచ్చి కొంతకాలంగా ఘర్షణ పడేవారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా సుగుణమ్మ ఇల్లు వదిలి వెళ్లిపోయింది. నరసింహామూర్తి తీవ్ర మనస్తాపం చెంది రాత్రి ఇంటిముందున్న రేకుల షెడ్ పైకప్పునకు పిల్లల ఊయల కోసం కట్టిన చీరను గొంతుకు బిగించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబికులు, ఇంటికి తిరిగొచ్చిన సుగుణమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి, శవాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహామూర్తి టీడీపీ కార్యకర్త కావడంతో స్థానిక నాయకులు మనోహర్, బెల్లాచెరువు చంద్ర, మూర్తి, గంగాధర్, అంజనప్ప, ఇర్షాద్, శ్రీరాములు, మల్లికార్జున, సుధాకర్, ఉదయ్, శంకర్ మృతదేహాన్ని సందర్శించి, అంత్యక్రియల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.


కడుపునొప్పి భరించలేక విద్యార్థిని...

మడకశిర రూరల్, జూన్ 27: మండలంలోని గౌడనహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థిని తేజశ్రీ(16) కడుపునొప్పి తాళలేక బుధవారం రాత్రి ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. తేజశ్రీ మూడు రోజుల క్రితం మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందింది. కొద్ది రోజుల నుంచి కడుపునొప్పి వస్తుండేదన్నారు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుమార్తె మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నాట్లు సీఐ మనోహర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 27: మండలంలోని ఖజాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడు గురువారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంకటరాముడు కుమారుడు శ్రీనివాసులు విషం తాగి పొలంలో పడి ఉండగా సమీప పొలంవారు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అతన్ని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు జరిపారు. మెరుగైన చికిత్సలకోసం హిందూపురం తరలించారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయరూ..


ఫలారం గ్రామం వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

గుడిబండ, జూన్ 27: మండలంలోని ఫలారం గ్రామ వద్దనున్న పెద్ద వంక వద్ద తెగిపోయిన కల్వర్టుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వంకలు, వాగులు ప్రవహించడంతో కల్వర్టు కొట్టుకుపోయింది. వర్షం వస్తే రోడ్డు దెబ్బతిని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కొట్టుకుపోయిన కల్వర్టును మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి


జయరాం మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ రూరల్, జూన్ 27: మండలంలోని అడదాకుల పల్లి గ్రామంలో సీనియర్ టీడీపీ కార్యకర్త జయరాం గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు స్వగ్రామానికి వెళ్లి జయరాం భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని జయరాం కుటుంబానికి భరోసా కల్పించారు.

అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర, జూన్ 27: అనుమతిలేని లేఔట్లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. నగర పంచాయతీ కమిషనర్‌కు సూచించారు. లేఔట్లను క్రమబద్ధీకరించడం ద్వారా ఆదాయం పెంచాలన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో పరిశుభ్రతకు పెద్దపీట వేసి, ఆదర్శ నగరపంచాయతీగా తీర్చిదిద్దాలని సూచించారు. రెండు వేల మంది ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకుంటే ఎందుకు అనుమతులు ఇవ్వలేదని ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కమిషనర్ రంగస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సుంకం వసూలు చేయడం దారుణం

మడకశిరటౌన్: చిరువ్యాపుల నుంచి ఇష్టారాజ్యంగా సుంకం వసూలు చేయడం దారుణమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. అధిక సుంకం వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారంలోపు మార్కెట్‌కు అడ్డంగా ఉన్న రేకుల షెడ్లను తొలగించాలన్నారు. అనంతరం మడకశిర నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసుకు ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణం 80 శాతం పూర్తయినా వైసీపీ ప్రభుత్వంలో మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయలేకపోయిందన్నారు.

అట్టహాసంగా హాకీ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూన్ 27: ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో గురువారం 14వ అంతర్‌రాష్ట్ర సీనియర్ బాలుర హాకీ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీ పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి కనబరచాలన్నారు. ధర్మవరంలో క్రీడల అభివృద్ధికి పాటు పడతామన్నారు. మంత్రి సత్యకుమార్, చిలకం మధుతో మాట్లాడి వచ్చే ఏడాది నిర్వహించే టోర్నీకి టర్ఫ్‌కోర్టును తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.

మొదటి రోజు విజేతలుగా పలు జట్లు..

ఉదయం ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల జట్లు తలపడగా 18-0గోల్స్ తేడాతో ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధించింది. అదేవిధంగా ప్రకాశం, కడప జిల్లాల జట్లు తలపడగా 8-0గోల్స్‌తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. శ్రీకాకుళం, తిరుపతిజిల్లాల జట్లు తలపడగా 1-4 గోల్స్‌తేడాతో తిరుపతి జట్టు గెలుపొందింది. కాకినాడ-కృష్ణా జిల్లాల జట్లు తలపడగా 12-0గోల్స్ తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించింది. అన్నమయ్య, విశాఖపట్నం జట్లు తలపడగా 1-2 గోల్స్‌తేడాతో విశాఖ పట్నం జట్టు విజయం సాధించింది. అనకాపల్లి, అనంతపురం జిల్లాల జట్లు తలపడగా 3-3 గోల్స్‌తో మ్యాచ్ డ్రా అయింది అదేవిధంగా నెల్లూరు, గుంటూరు జిల్లాల జట్లు తలపడగా 3-3 గోల్స్‌తో డ్రా అయింది. శ్రీసత్యసాయి జిల్లా, కర్నూలు జిల్లాల జట్లు తలపడగా 12-0 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా గెలుపొందింది. కార్యక్రమంలో ఏపీ హాకీ అకాడమీ సీఈఓ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, జనరల్ సెక్రెటరీ హర్షవర్ధన్, కోశాధికారి తామస్ పీటర్, సత్యసాయిజిల్లా ప్రతినిధులు సూర్యప్రకాశ్, ఉడుముల రామచంద్ర, అంజన్న, విశ్వనాథం, ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పావగడలో సినిమా షూటింగ్


చిన్నారులతో గ్యాంగ్‌వార్ సినిమా బృందం

పావగడ, జూన్ 27: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గ్యాంగ్‌వార్ కన్నడ సినిమా షూటింగ్ 15రోజులుగా జరుగుతోంది. గురువారం చిత్ర బృందం నుంచి రొద్దం గ్రామ పంచాయతీ నుంచి అంగనవాడీ పిల్లలకు ఆట సామాగ్రి పంపిణీ చేసి ఆటల పోటీల్లో పాల్గొన్నారు. సినిమా డైరెక్టర్ అరవింద్ కౌషిక్ మాట్లాడుతూ.. పావగడలో షూటింగ్ జరిగినన్ని రోజులు ఇక్కడ ప్రజలు, ప్రేక్షకులు చూపిన ఆప్యాయత ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఒక్కోరోజు జరిగిన షూటింగ్‌లో ఇక్కడ తెలుసుకున్న చరిత్ర మైలురాయిగా నిలిచి పోతుందని తెలిపారు. ప్రతిరోజూ షూటింగ్‌లో బిజీగా ఉండి చిన్న పిల్లలతో ఆటల పోటీల్లో పాల్గొనడం ఎంతో ఉత్సాహంగా ఉందని కోడైరెక్టర్ శిల్పా తెలిపారు. పావగడ సత్యలోకేష్, మానం శశికిరణ్, బృందం శ్రీనాథ్, గురు, ప్రదీప్, బుడేన్‌బాబు, ఉమేష్ పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మడకశిరటౌన్, జూన్ 27: పట్టణంలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లాలని బడిబయట ఉన్న పిల్లలను బడికి పంపించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రాప్‌అవుట్ సంఖ్యను తగ్గించాలని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలన్న లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, శకుంతలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

6 నుంచి శిక్షణ తరగతులు

పెనుకొండ, జూన్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో జూలై 6 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందటానికి 10, ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు కళాశాలలోని స్కిల్ హబ్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9676706976 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హెచ్‌ఎంలకు అవగాహన

హిందూపురం(పరిగి), జూన్ 27: విద్యా ప్రవేశంపై ప్రధానోపాధ్యాయులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పరిగి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సుకు డిప్యూటీ డీఈఓ రంగయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు, బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి అటెండెన్స్ పెంచాలన్నారు. ఎంఈఓ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన

పుట్టపర్తిరూరల్, జూన్ 27: జూలై 1వ తేదీ నుంచి అమలు కానున్న చట్టాలపై పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేర కు అవగాహన సదస్సు జరిగింది. ఐటీ కోర్ టీం సభ్యుడు సుదర్శన్‌రెడ్డి కొత్తచట్టాలైన సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో వచ్చిన అప్డేట్, ఈ సాక్షాయాప్, ఎన్‌సీఆర్బీసంకలన్ యాప్, డీజీలాకర్ యాప్‌లను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి, వాటిని ఎలా ఇన్వెస్టిగేషన్‌లో ఉపయోగించాలో పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్‌పరిధిలోని డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, జూన్ 27: కడుపు నొప్పి తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని యాదవవీధికి చెందిన నరసింహులు కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం నొప్పి తీవ్రం కావడంతో తాళలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


ఇస్లాపురం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

పెనుకొండ రూరల్, జూన్ 27: పట్టణంలోని ఇస్లాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టీడీపీ కౌన్సిలర్ గీతా హనుమంతు విద్యా సామగ్రి అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం పాఠశాలలో చదువుతున్న 70మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు ప్రదానోపాధ్యాయుడు కృష్ణానాయక్ తెలిపారు. గీతా హనుమంతు మాట్లాడుతూ బీసీ, వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బాధ్యతలు చేపట్టిన శుభసందర్భంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మల్లిక, టీడీపీ నాయకులు సత్యం, హనుమన్న, శ్రీరాములు, యర్ర సత్యం, రవితేజ, రమేష్, శ్రీహరి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని కె. రాగిమేకలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకుడు గంగాధర్‌రెడ్డి పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 12 మంది విద్యార్థులు చదువుతుండగా, నోటు పుస్తకాలు, పలక, పెన్సిల్, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు అందించారు. అదే గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గంగాధర్ రెడ్డి గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధికోసం ప్రతియేటా విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, మహేష్ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


గోరంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ

గోరంట్ల, జూన్ 27: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ అనురాధ గురువారం తనిఖీ చేశారు. ఎగువ గంగంపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ఎర్రయ్యగారిపల్లి, గోరంట్ల-5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రాలోని రికార్డులు, స్టాక్ రిజిష్టర్లు తనిఖీ చేసి, పిల్లలు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు కూరగాయాలు సేకరించి, నాణ్యమైన ఆహారం అందించాలని కార్యకర్తలను ఆదేశించారు. ప్రజలనుంచి ఎలాంటి ఫిర్యాదు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతోపాటు సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

అంగనవాడీ, బీసీ హాస్టల్..

అగళి: అంగనవాడీ కేంద్రాలు, బీసీ హాస్టల్‌ను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని మధూడి బీసీ హాస్టల్, అగళి బీసీ హాస్టల్‌ను వారు పరిశీలించారు. ఆయా హాస్టళ్లలో విద్యార్థుల హాజరు, భోజన వసతి, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై ఆరాతీశారు. గత యేడాది పరీక్షా ఫలితాలు ఎలా ఉన్నాయి, కష్టపడి బాగా చదవి ర్యాంక్ తీసుకురావాలని సూచించారు. తహసీల్దార్ వెంట వార్డన్ సికిందర్‌బాషా, సిబ్బంది ఉన్నారు. మండల కేంద్రంలోని నాలుగు అంగనవాడీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు.

మెరుగైన వైద్యం అందించండి: డీఎంహెచ్ఓ


వైద్యులకు సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి మంజులవాణి

హిందూపురం(సోమందేపల్లి), జూన్ 27: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి మంజులవాణి సిబ్బందికి సూచించారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. డయేరియా, వ్యాక్సినేషన్, సీజనల్ వ్యాధులు కోసం చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. సిబ్బంది తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వైద్యాధికారి హరికుమార్, ఓంకార్, సీహెచ్ఓ మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్ అనీల్, ఫార్మసిస్ట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ మధుబాబు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్టియన్ ఫెడరేషన్ వార్షికోత్సవం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న క్రైస్తవులు

హిందూపురం అర్బన్, జూన్ 27: పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుల పెద్దలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మతోన్మాద శక్తుల వలన క్రైస్తవులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించే విధంగా భయభ్రాంతులకు గురిచేయడం సరి కాదన్నారు. సంవత్సర కాలంగా మణిపూర్‌లో విధ్వంసకాండ కొనసాగుతూనే ఉందన్నారు. క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్వేచ్ఛావాతావరణం కల్పించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. నాగేంద్ర కుమార్, హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ రెవరెండ్ సూర్యప్రకాష్, సంఘం పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్‌రాజ్, పాల్మన్‌రాజ్, దేవరాజు, అరుణ్‌కుమార్ జార్జిబాబు, డేనియల్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి తీర్చండి: ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, జూన్ 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి వారి ఆకలి తీర్చాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ప్రభుతంలో ఇంతకు ముందు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే వారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం తొలగించి విద్యార్థుల నోటి కాడ కూడా లాగేసుకుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఆకలితో అలమటించారన్నారు. సీఎం చంద్రబాబు కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని కోరారు. పాఠశాలలు జూన్ 13న ప్రారంభమైనప్పటికీ నేటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు చంద్రశేఖర్, తరుణ్, జస్వంత్, మంజునాథ్, అమ్రేష్ పాల్గొన్నారు.

విద్యావిషయాల్లో జాగ్రత్త తీసుకోవాలి


అగళి, జూన్ 27: విద్యార్థులను బడిలో చేర్పించే విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు సూచించారు. అగళిలోని మోడల్ పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ 22 అంశాలపై చర్చించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వాటిపై వివరించారు. నేను బడికి పోతా, విద్యా ప్రవేశ్, విద్యా పోషణ్, స్టూడెంట్ మెటీరియల్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఆయా మార్పిడి, రాగి జావ, చిక్కీ తదితర వాటిని చర్చించారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి


కెంపేగౌడ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న అధికారులు, నాయకులు

పావగడ, జూన్ 27: కన్నడనాడ ప్రభ బెంగళూరు నగర సంస్థాపకుడు కెంపేగౌడ 515వ జయంతిని పావగడ పట్టణంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తాలూకా కార్యాలయంలో తహసీల్దార్ వరదరాజు, సిబ్బంది కెంపేగౌడ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. 515 సంవత్సరాల క్రితం బెంగళూరు ఓ కుగ్రామంగా ఉండేదని కెంపేగౌడ 35 సంవత్సరాల్లోనే నగరాభివృద్ధికి పాటుపడటంతోపాటు బెంగళూరు అనే పేరుపెట్టి ఆదర్శంగా తీర్చిదిద్దారని వారు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని ఈఓ ఇంద్రాణి కోరారు. సీడీపీఓ సునీత, ఈఓ జానకిరాం, డీటీ నరసింహమూర్తి, తాలూక స్థాయి అధికారులు, కెంపేగౌడ అభిమానులు పాల్గొన్నారు.

మూలనపడ్డ స్వచ్ఛభారత్ ట్రాక్టర్


నిరుపయోగంగా ఉన్న పంచాయతీ ట్రాక్టర్

పెనుకొండ టౌన్, జూన్ 27: మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం స్వచ్ఛభారత్ కింద మంజూరు చేసిన ట్రాక్టర్ మూలనపడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మందలపల్లి పంచాయతీని రెండు భాగాలుగా విడగొట్టి సీసీగిరి పంచాయతీని ఏర్పాటు చేశారు. వైసీపీ నాయకుల మధ్య విభేదాలు రావడంతో ట్రాక్టర్‌ను సీసీగిరి పంచాయతీకి తీసుకెళ్లారు. అయితే వైసీపీ నాయకులు ట్రాక్టర్‌ను తిరిగి మందలపల్లికి తీసుకొచ్చారు. ట్రాక్టర్ ముందు చక్రం, బ్యాటరీ లేకపోవడంతో ఏళ్లతరబడి మూలానపడిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి మూలానపడ్డ ట్రాక్టర్‌కు మరమ్మతు చేసి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అమరేష్‌ను వివరణ కోరగా ట్రాక్టర్‌కు బ్యాటరీ, ముందు చక్రం లేకపోవడంతో నిలబెట్టామని, త్వరలో వాటిని అమర్చి వినియోగంలోకి తెస్తామన్నారు.